# తొలి కిరణం

## -అత్తలూరి విజయలక్ష్మి

''హలో! గుడ్‌మార్నింగ్''

తల వంచుకుని గబగబా నడుస్తున్న మోహిని ఆగిపోయింది.

ఎదురుగా అతను. వైట్ డ్రెస్. నిర్లక్ష్యంగా పడిన క్రాఫ్. అక్కడక్కడ మెరుస్తున్న నెరిసిన వెంట్రుకలు. ఎర్రజీరలు కనిపిస్తున్న పెద్ద కళ్లు.

''గుడ్ మార్నింగ్'' కొద్దిగా సంశయంగా చెప్పింది.

వారం రోజుల్నుంచి కొత్తగా వాకింగ్‌కి వస్తున్న కొత్త మొహం.

తను ఏడాదిగా ఇదే కొండలపైన వాకింగ్ చేస్తోంది. ఎవరెవరో తటస్థపడుతుంటారు. కొందరు పలకరిస్తారు. కొందరు చిరునవ్వుతో విష్‌చేసి వెళ్లిపోతారు.

కానీ ఇతనెవరో చిరునవ్వులతో ప్రారంభమై పలకరింపు, గుడ్‌మార్నింగ్ దాకా వచ్చింది.

''మీరీ ఏరియాలోనే వుంటున్నారా?''

అప్పుడే విచ్చుకుంటున్న వెలుగురేఖలు కెంపురంగు పులుకుంటున్న ఆకాశం, రివ్వున ఎగురుతున్న పక్షులు, కొంచెం దూరంలో వున్న ఆంజనేయస్వామి ఆలయంలో మోగుతున్న గంటలు.

ఆ మనోహర నేపథ్యంలో అతని స్వరం మృదు గంభీరంగా వినిపించింది.

''అవునండీ'' మృదువుగా చెప్పింది.

''అయామ్ ప్రొఫెసర్ రవిచంద్ర. ఉస్మానియా యూనివర్శిటీ. అదిగో ఆ కనిపించే క్రీమ్‌కలర్ బిల్డింగ్ నాదే. ఇంతకాలం అది అద్దెకిచ్చాను. రీసెంట్‌గా షిఫ్ట్ అయ్యాను. అఫ్‌కోర్స్ ఒక్క రూం మాత్రమే వాడుకుంటున్నాను.''

బ్రహ్మచారి కాబోలు...మౌనంగా నవ్వి ఊరుకుంది.

''ఈ కొండలు, ఈ ప్రశాంతమైన వాతావరణం చాలా హాయిగా వుంటుంది. ట్రాఫిక్ గోల, వాహనాల కాలుష్యం లేకుండా ఆరోగ్యకరమైన పరిసరాల్లో వాకింగ్ చేయడం ఆరోగ్యానికెంతో మంచిది. కేవలం వాకింగ్ కోసమే నేనిక్కడికి షిఫ్ట్ అయ్యాను. నమ్ముతారా?''

నవ్వింది మోహిని.

''మీ వివరాలేం చెప్పలేదు?''

''అయామ్ మోహిని. వర్కింగ్ ఇన్ ఏజి ఆఫీస్''

''నైస్ టు మీట్‌యూ. వాకింగ్ ఫ్రెండ్‌గా రేపు ఉదయం మీకోసం ఎదురుచూడవచ్చా?'' క్రీమ్‌కలర్ బిల్డింగ్ ముందు ఆగాము.

''ష్యూర్'' చిరునవ్వుతో ముందుకు నడిచింది.

రూమ్‌కెళ్లిన మోహిని పదినిముషాలు మంచంపై వాలి సేద తీర్చుకుంది. రవిచంద్ర... పేరు బాగుంది. మనిషి కూడా బాగున్నాడు. నలభై ఏళ్లు వుంటాయేమో! పెళ్లెందుకు చేసుకోలేదు? అతని కళ్లల్లో ఎర్రజీరలు, కళ్లక్రింద ఉబ్బిన చర్మం చూస్తే తాగుబోతులా ఉన్నాడు.

నెమ్మదిగా లేచి బాత్రూంలోకి వెళ్లి గీజర్ ఆన్ చేసింది. చకచకా పనులు చేసుకుని స్నానం చేసి వంట పూర్తిచేసింది. బాక్స్ సర్దుకుని తయారై ఇంటి తాళం వేసింది. తాళాం చెవులు బాగ్‌లో వేసుకుని బస్టాప్‌కేసి నడిచింది. ఒకే ఒక బస్ ఉంది మహేంద్ర హిల్స్‌నుంచి కోఠి దాకా. స్టేషన్‌లో దిగిపోతే ఎజి ఆఫీస్‌కి బోలెడు బస్సులు. వీలు చూసుకుని వెహికిల్ కొనుక్కోవాలి.

''హలో! బస్ కోసమా? రండి డ్రాప్ చేస్తాను'' ఎర్రటి మారుతీ కారులోంచి తొంగి చూసాడు.

''మీరా? ఎందుకండీ...ఇప్పుడు బస్ వుంది. వచ్చేస్తుంది''

''ఏం ఫర్వాలేదు. ప్లీజ్ కమ్''

''అదిగో బస్ వచ్చింది. థాంక్స్...బై'' పరుగున వెళ్లి బస్ అందుకుంది. సీటు దొరుకుతుంది. స్టార్టింగ్ పాయింట్ కదా!

మారుతీ కారు కనుమరుగైంది.

సన్నగా నిట్టూర్చింది. 'గుడ్ మార్నింగ్, లిఫ్ట్ ఇచ్చేదా?' వరకు వచ్చింది. నో! జాగ్రత్తగా వుండాలి. మగాణ్ణి నమ్మడం ఫూలిష్‌నెస్.

మోహినికి తల్లిలేదు. తండ్రి, నాన్నమ్మల దగ్గర పెరిగింది.

తల్లి చనిపోవడానికి కారణం వాళ్లు పెట్టిన చిత్రహింసలని ఆమెకి తెలిసేటప్పటికి పదహారేళ్లు వచ్చాయి. సవతి తల్లి కొడుకు బ్రహ్మం నీచుడు. వావీ వరుసా చూడకుండా తనపైన అత్యాచారం చేయబోయాడు. తండ్రికి చెప్తే నమ్మలేదు. సవతి తల్లి కొట్టింది నా కొడుకు మీద నిందలేస్తావా అని. నాన్నమ్మకి చెప్తే ఇంటిగుట్టు రచ్చకీడ్చకూడదు అన్నది.

డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగం పేరుతో ఆ నరకాన్నుండి బయటకు వచ్చింది. యవ్వనం, కోరికలు, ఆశలు, మగవాడు, ప్రేమా, పెళ్లి ఈ పదాలన్నీ డిక్షనరీలోంచి కొట్టేసింది.

కొలీగ్ కృష్ణవేణి బంధువుల ఇంట్లో ఔట్‌హౌస్ అద్దెకి దొరికింది. ఆ ఇంటి యజమానురాలి అండ, అభిమానం పుష్కలంగా దొరికాయి. అందుకే ఆ మహేంద్ర హిల్స్‌పైన ఆ పోష్ లొకాలిటీలో ఆమె ఒంటరి జీవితం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగుతోంది.

మర్నాడు ఉదయం అయిదున్నరకి ఆ చిరుచీకట్లో అత్యంత మధురంగా పలకరించాడు రవిచంద్ర ''గుడ్‌మార్నింగ్'' అంటూ.

మాట్లాడక తప్పలేదు. మాటల్లోనే కలిసి నడిచారు. రోజుకన్నా ఎక్కువ దూరం. ఆంజనేయస్వామి గుడి దగ్గర ఆగారు.

''ఈ గుడి చాలా బాగుంటుంది. ప్రశాంతంగా, రద్దీగా వుండే ప్రదేశాల్లో గుడి వుంటే నాకిష్టంలేదు'' దూరంగా ఎయిర్‌పోర్ట్‌లో వెలుగుతున్న దీపాలు చూస్తూ అన్నది.

''మీకు భక్తి ఎక్కువా?''

''లేదు. ఎక్కువా లేదు, తక్కువా లేదు. బట్ ఐ బిలీవ్ గాడ్''

''ఎందుకని? దేవుడున్నాడని ఎలా నమ్మాలి?''

''దేవుడు ఉన్నాడా లేడా అన్నది ఎప్పుడు ఆలోచించలేదు. కానీ మానవుడి మేధస్సుకి మించిన ఓ అపూర్వశక్తి ఏదో ఈ సృష్టిని నడిపిస్తోందని నమ్ముతాను.''

''ఆ శక్తి దేవుడనుకుంటున్నారా?''

''దయ్యం అనుకోవడానికి ఆస్కారం లేదుగా!''

''ఏం?''

''దెయ్యం ఈ సృష్టిని నడిపిస్తే ఈ సృష్టిలో ఇన్ని అందాలుండవు.''

నవ్వాడతను.

''చాలా మంచి నమ్మకమే. ఖాళీ సమయాల్లో ఏం చేస్తుంటారు?''

''సంగీతం వింటాను. సాహిత్యం చదువుతాను.''

''తెలుగా? ఇంగ్లీషా?''

''ప్రస్తుతానికి తెలుగే. తెలుగులో వున్న మంచి రచనలన్నీ చదివేశాక ఇంగ్లీషు జోలికి వెళ్తాను.''

''పొయిట్రీ ఇష్టమేనా?''

''ఊ...కృష్ణశాస్త్రిగారి భావగీతాలు ఇష్టం''

''నేను మీకు రేపు ఇంగ్లీష్ పొయెట్రీ ఇస్తాను. చదవండి. వర్డ్స్‌వర్త్‌ది''

''అమ్మో! నాకంత భాషా పరిజ్ఞానం లేదు.''

''జ్ఞానం అనేది మీ దగ్గరికిరాదు. మీరు అన్వేషించాలి. అది పుస్తకాల్లో లభిస్తుంది. చదివితే అలవాటు అవుతుంది.''

''అలాగే. థాంక్స్. అరె...మాటల్లో చాలా దూరం నడిచాం. ఇది మా ఇల్లు'' గేటు దగ్గరకు నడిచింది.

''మీ ఇంటికి నన్ను ఆహ్వానించాలంటే చాలా సమయం పడుతుందనుకుంటాను?'' నవ్వాడు.

''రండి. కాఫీ తాగి వెళ్దురుగాని.''

''థాంక్యూ'' అనుసరించాడు.

''కూర్చోండి. బీద ఇల్లు'' నవ్వింది కేన్ కుర్చీ జరిపి.

''ఇల్లు చిన్నదైతే ఇంట్లోవాళ్లమధ్య సాన్నిహిత్యం పెరు

గుతుంది.

''కాఫీ తెస్తాను'' కిచెన్‌లోకి నడిచింది.

''మీ ఇంటిముందు గార్డెన్ చాలా అందంగా ఉంది. ఇంటివాళ్ల అభిరుచి హర్షించాలి.''

''కాఫీ తీసుకోండి'' కప్పు అందించి మంచం అంచున కూర్చుంది.

కిచెన్, ఒక రూమ్... అదే డ్రాయింగ్ కమ్ బెడ్‌రూమ్.

''మీ ఇంటిముందు కూడా బ్యూటిఫుల్ లాన్ చూసాను. మీదేనా అభిరుచి?'' నవ్వుతూ అడిగింది కాఫీ సిప్ చేస్తూ.

''కాదు. ఇంట్లో అద్దెకున్నవాళ్లది. కాఫీ చాలా బాగుంది. రోజా ఓ కప్పు కాఫీ మీనుంచి కోరాలని వుంది.''

ఆమె ఏం మాట్లాడలేదు.

''భయమేస్తోందా రోజా ఇదెక్కడి గోల అని?''

''అబ్బే అదేంలేదు...'' తడబడిందామె.

అతను వెళ్లిపోయాడు.

మర్నాడు ఆ మర్నాడు అడుగుల్లో ఆత్మీయత పెరిగింది.

''ప్రేమించి కోరి కోరి పెళ్లి చేసుకున్నాను. అభిప్రాయభేదాలు... అభిరుచుల్లో తేడాలు... అపార్థాలు. విడిపోతానంది. సరే అన్నాను. తను మర్చిపోయింది. నేను మర్చిపోలేకపోతున్నాను. స్థలం మార్చాను. ఊరు మార్చాను. సుదూర ప్రదేశంలో ఏకాకిగా బ్రతుకుతున్నాను మోహినిగారు. జీవితంలో అన్నిటికన్నా విషాదకరమైంది ఒంటరిగా బ్రతకడం.''

మోహిని మాట్లాడలేదు.

'కాదు... అదే ఆనందదాయకం' అనుకుంది.

''మోహినిగారు! ఈ మూడునెలలుగా చూస్తున్నాను మీ జీవన విధానం, మీ మెత్తని మనసు, హుందా ప్రవర్తన నన్నెంతో ముగ్ధుణ్ణి చేసాయి. మీకు నా గతం మీద ఏవగింపు లేకపోతే మన మార్నింగ్‌వాక్ జీవితాంతం ఉండాలని కోరుకుంటున్నాను.''

వద్దనుకున్న పరిస్థితి ఎదురైంది. వినకూడదనుకున్న మాట వినాల్సి వచ్చింది.

''మీ అభిప్రాయం వెంటనే చెప్పనక్కర్లేదు. ఆలోచించి చెప్పండి.''

ఏం ఆలోచించాలి? తనకి మగాడంటే అసహ్యం, పెళ్లంటే రోత, ప్రేమంటే రోత, కాపురం అంటే చీదర...

''ఎంతకాలం ఒంటరిగా బ్రతుకుతావు?'' అని అడిగారెవరో!




''జీవితాంతం'' అన్నది తను.

''తోడు చాలా అవసరం మనిషికి'' అన్నారు.

''నాకనవసరం'' అన్నది తను.

వారం రోజులు గడిచాయి.

ఆశగా ఎదురుచూసిన రవిచంద్ర ఓరోజు అకస్మాత్తుగా మాయమయ్యాడు.

వాకింగ్ సమయంలో అతనికోసం ఎదురుచూసిన మోహినికి మూడురోజుల తరువాత ఓ కవర్ వచ్చింది. విప్పి చూసింది మోహిని.

''ఈ మూడునెలల సాన్నిహిత్యంలో నాకు జీవితం ఓ మధురకావ్యంలా అనిపించింది. కావ్యంలోని సొగసులు నన్ను మీతో బ్రతకమని శాసించాయి. అందుకు మీరనుమతించలేదు. మీ మౌనం అంగీకారమే అని ఆశగా చూసాను. కాదని తెలిసాక కలిగిన బాధ తట్టుకోలేకపోయాను. అందుకే మీకు దూరంగా వెళ్తున్నాను. మార్నింగ్ వాక్ కూడా మానేసాను. ఎప్పటికైనా నా తోడు కోరుకుంటే నన్ను ఆహ్వానిస్తారని ఆశతో...

రవిచంద్ర

ఆ ఉత్తరం మోహిని మనసుని కదిపేసింది.

ఎంత వ్యధ? ఎంత ఆవేదన!

అక్షరం... అక్షరంలో గాయపడిన గుండె తాలూకు ధ్వని.

రవిచంద్రగారూ! సారీ!

మోహిని అలవాటు ప్రకారం వాకింగ్‌కు బయలుదేరింది.

చీకటిగా వుంది. కొండల్లోంచి చిత్రమైన శబ్దాలు.

పిచ్చిమొక్కల మీంచి వీస్తున్న గాలితో వింతైన పరిమళాలు.

ఇంతకాలం ప్రశాంతంగా అనిపించిన ఆ పరిసరాలు ఇప్పుడు భయంకరమైన నిశ్శబ్దంలా భయం గొలుపుతున్నాయి.

ఇంతకాలం ఆహ్లాదపరచిన ఆ చల్లగాలి ఈ రోజెందుకో సుడిగాలిలా మారి గుండెని కోస్తోంది.

నిశ్శబ్దంగా నిలిచిన ఆ కొండలు తన మార్గానికి అడ్డుగోడల్లా అనిపిస్తున్నాయి.

ఎక్కువ దూరం నడవకుండానే ఇల్లు చేరింది.

కాఫీ తాగుతుంటే రుచి తెలియడం లేదు.

''మంచి పరిమళం మీ చేతి కాఫీకి'' రవిచంద్ర మాటలు గుర్తొస్తున్నాయి.

ఇవాళ వంటరితనం భయపెడుతోంది. బాధపెడుతోంది. ఏడాదిన్నరగా లేని వెలితేదో ఈరోజు కనిపిస్తోంది.

కళ్లు తెరిచినా కళ్లు మూసినా శూన్యంగా వుంది.

''ఎంతకాలం ఒంటరిగా బ్రతుకుతావు?'' ఎవరిదో స్వరం.

''జీవితాంతం'' ఇవాళ ఒక్కమాట కూడా గొంతు దాటడం లేదు.

''ఏమో! బ్రతకగలనో లేదో?'' అనూహ్యమైన సందేహం.

టైము గడిచిపోతోంది.

రోజా చేసే ఏ పనీ చేయాలని లేదు.

స్నానం చేయాలనీ, ఆఫీసుకు వెళ్లాలని అనిపించడం లేదు.

ఎందుకని? ఎలా వచ్చిందీ మార్పు!

ఆడవారి మనసు తెల్లకాగితం లాంటిది. ఏమీ రాయనంతవరకూ అది అలా పడుంటుంది. ఏదన్నా రాస్తే ఆ కాగితాన్ని భద్రపరచాల్సిందే. తెల్లకాగితం లాంటి తన మనసు మీద రవిచంద్ర 'ప్రేమ' అనే రెండక్షరాలు రాశాడు. ఇప్పుడీ మనసు తను భద్రంగా దాచాలి. కానీ...ఎలా?

రేడియో ఆన్ చేసింది.

'జిందగీ...కిత్‌నీ కూబ్ సూరత్‌హై...

ఆయియే...ఆప్‌కీ జరూరత్‌హై...'

మంద్రంగా గుండెల్ని కోస్తూ మనసు పొరల్ని తాకుతూ మధురంగా విన్పిస్తోందా పాట.

పెన్నూ లెటరుపాడూ చేతిలోకి తీసుకుంది మోహిని పాట వింటూ.

★